అంజన విషయానికొస్తే ఆమె అభిరుచుల్ని అన్నీ గౌరవించినట్లు కనపడేవాడు కామేశ్వరరావు. అందుచేత ఆమె అతన్ని పూర్తిగా నమ్మింది. ఇలాంటి చోట మగ వాడ్ని నమ్మిన ప్రతి ఆడది ఖచ్చితంగా మోసపోతుంది. కారణం మగవాడికి అయాచితంగా వచ్చిన ఆడదాని మీద అంతులేని తేలిక భావం ఉండటమే.

కంపెనీల బరువు బాధ్యతలన్నీ కామేశ్వరరావే చూస్తున్నా ఆస్తి అంతా అంజన పేరే వుంది. ఆమె అతడ్ని పూర్తిగా నమ్మి వుండటం వల్ల... ఆ నమ్మకంతోటే ఒకసారి గుడ్డిగా అతను సంతకాలు పెట్టమన్న చోటల్లా పెట్టింది.

అంజనకు ఆ తర్వాత... చాలా రోజుల తర్వాత తెలిసింది ఆస్తి అంతా అతడి పేర ట్రాన్స్‌ఫర్ అయిపోయిందని.

సంతకాలన్నీ తను పెట్టినవే!

ఈ నిజాన్ని ఆమె భరించ లేకపోయింది.

అతను స్ట్రయిట్‌గా అడిగి వుంటే తనే ఆస్తిలంతా అతడి పేర ట్రాన్స్‌ఫర్ చేసి వుండేది. అలా కాకుండ తనను మభ్య పెట్టి సంతకాలు పెట్టించుకోవటం మెంటల్‌గా ఆమెను అఫ్‌సెట్ చేసింది. ఈ షాక్‌కి తట్టుకోలేక వారం రోజుల పాటు సంఘర్షించి... ఆ సంఘర్షణకి తట్టుకోలేక సీలింగ్ ఫాన్‌కి ఉరేసుకొని చనిపోయింది.

ఓ.అర్.కె.రావుకు... ఆమెకు పిల్లలు పుట్టక పోవటం ఆమె అదృష్టం. లేకపోతే వాళ్ళు అనాథలయి పోయి వుండేవారు.

ఆ రాత్రి ఆమె చనిపోయే ముందు డైరీలో ఒకే ఒక వాక్యం రాసుకుంది. ఆమెకు డైరీ రాసే అలవాటు లేదు. అయినా ఆ రోజు ఇంట్లో వున్న కొత్త డైరీలో ఇలా రాసుకుంది.

"ఆడది నమ్మకూడని జంతువు మగాడు. ఈ జంతువును నమ్మిన ఏ ఆడది ఈ భూమి మీద సుఖపడలేదు. అలా పడివుంటే ఈ జంతువు పూర్తిగా మగవాడైనా కాకుండా వుండాలి. లేకుంటే ఈ ఆడది మగవాడికన్నా ఏడాకులు ఎక్కువ చదువు చదివైనా వుండాలి...!"

సంఘం... నీతి నియమాలు... గౌరవం ఏమీ పట్టించుకోకుండా నేను ఓ పరాయి మగవాడికి నా శరీరాన్ని ఆత్మనీ అన్నీ అర్పించినందుకు నాకు మిగిలింది కడివెడు కన్నీళ్ళు... చిటికెడు బూడిద... దట్సాల్...!

(ఇంకావుంది)





## మహిమ

టి.విలో ప్రసారం కాబోయే "చిత్రలహరి" చూడ్డానికి కూర్చు న్నారు, రామారావు, సత్యవతి. ఎడ్వ ర్‌టైజ్‌మెంట్స్ వస్తున్నాయి. సత్యవతి ని ఓ ఎడ్వర్‌టైజ్‌మెంట్ బాగా ఆకర్షించింది. అదేంటంటే— ఓ పిల్లల తల్లిని చూసి కొంత మంది కాలేజీ అమ్మాయిలు "మీరు ఏ కాలేజీలో జదవుతున్నారు?" అనడి గితే, దానికా పిల్లల తల్లి "అబ్బే నేను ఏ కాలేజీలోను చదవడం లేదు. ఇలా కుర్రదానిలా కనబడ్డానికి కారణం నేను వాడే ఫలానా సబ్బు" అని చెపుతుంది.

వెంటనే సత్యవతికి పెళ్ళీడు దాటిన తన కూతురు జ్ఞాపకాని కొచ్చింది. ఆ అమ్మాయి ముదురుగా కనబడుతుంది వచ్చిన సంబంధాలు తప్పిపోతున్నాయి. అందుకే భర్తకు చెప్పి ఆ సబ్బులు డజన్ల కొద్ది తెప్పించి కూతురు చేత రోజుకు రెండు చొప్పున వాడించింది. సత్య వతి కూతురుకు మళ్ళీ పెళ్లి చూపు లయ్యాయి. వాళ్ళు ఏసంగతి ఊరెళ్ళి ఉత్తరం రాస్తామన్నారు. కొన్ని రోజుల తర్వాత వాళ్ళ దగ్గర నుండి ఉత్తరం నుచ్చింది.

* * *

ఆ రాత్రి మళ్ళీ టి.వి.లో ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ వస్తున్నాయి. సత్యవతి కూతురు చేత వాడించిన సబ్బు ఎడ్వర్‌టైజ్‌మెంట్ రాగానే సత్యవతి కోపం పట్టలేక ప్రక్కనే ఉన్న కుర్చీ తీసుకుని టి.వి.ని భళ్ళున బద్దలకొట్టేసింది.

తుల్లి రాజగోపాల్